
"చల్లని గాలితోబాటు మల్లె, జాజుల సువాసనలు కిటికీలోనుండి వస్తున్నాయి. అంతకంటె హాయిగా ఎమ్. ఎస్. గోపాలకృష్ణన్‌గారి వాయులీన వాద్యం వినిపిస్తూంది. బాలభాస్కరుడు తన అందాన్నంతా చూపిస్తూ కిటికీలోనుండి తొంగి చూడ ప్రయత్నిస్తున్నాడు. అప్పుడే నిద్ర లేస్తున్న రావుకి భార్యనూ, ఆమె చేతిలో ఉన్న కాఫీని చూసేసరికి మల్లె, జాజుల సువాసన రాలేదు. చెవుల కింపుగా ఉన్న వాద్యం వినపడలేదు. అనురాగంతో ఆమె వైపు చూసి ఆమె చేతిమీద బహుమతిగా ముద్దు పెట్టుకుని పంచదార లేని కాఫీని అమృతంలా సేవించాడు రావు."

'ఛ! ఇదీ ఓ కథే?' చదవటానికి చిరాకు వేసింది. 'భార్యమీద ఎంత ప్రేమ ఉంటే మాత్రం...ఛ! పంచదార లేని కాఫీ ఎలా తాగాడు? మూవింగ్ లవ్ స్టోరీ' అనుకుని ఆ పుస్తకాన్ని బల్లమీద పడేసి కాలింగ్ బెల్ నొక్కాడు. అప్పటికే అయిదయింది సాయంత్రం. ముఖం కడుక్కొని వచ్చేసరికి వెయిటర్ కాఫీ తీసుకొచ్చాడు. కాఫీ కార్యక్రమం పూర్తిచేసి క్లబ్బుకి బయలుదేరాను.





## కొల్లూరు సూర్యకుమారి

శ్రీధర్, రాజారావు మాత్రం ఉన్నారు పేకాట బల్ల వద్ద, ఏవో వీక్లీస్ చూస్తూ.

"అదిగో, మూర్తి వచ్చాడు" అన్నాడు శ్రీధర్ ఇంత ముఖం చేసుకుని.

"ముక్కలు కలపనా అయితే?" అన్నాడు రాజారావు, వీక్లీ పక్కన పడేస్తూ.

"కృష్ణారావు, శేఖర్ ..." ఇంకా నా మాట పూర్తి కాలేదు.

"కొత్తగా పెళ్ళయిన వాళ్ళు కదుటోయ్? పండగ నాలుగు రోజులు పెట్టుకుని ఇంకా ఇక్కడ కూర్చుంటారా, అత్తారిళ్లలో మజాగా గడపక!" అంటూ అత్తవారి ల్లొకసారి జ్ఞాపకం తెచ్చుకుని అన్నాడు రాజారావు.

మేము అయిదుగురం ఇంచుమించు ఒకే వయస్సు వాళ్లం. రాజారావు మాత్రం కాస్త సీనియర్-ఉద్యోగంలోనూ, వయస్సులోనూ. మేము కొత్తగా ఒక ఏడాది నుండి అప్రెంటీసులుగా ఉంటున్నాం ఫాక్టరీలో. ఉద్యోగ రీత్యానే కాకుండా క్లబ్బు, పేకాట ద్వారా మరింత దగ్గరయ్యాము.

"నెక్స్ట్ టైమ్ మన మూర్తి కూడా ఉండడు" అన్నాడు శ్రీధర్.

"డోన్ట్ వర్రీ! నేను వెళ్లనులే" అన్నాను.

"వెళ్లకపోతే ఊరుకుంటారుటోయ్, మూర్తీ, మా చెల్లెలు? సారీ, మీ ఆవిడ." అప్పుడే వరసలు కూడా కలిపేసుకుంటున్నాడు శ్రీధర్.

నాకు ఒళ్లు మండింది. "నేను ఒక లక్ష కూడబెట్టాలి. అప్పటిదాకా పెళ్లీ లేదు, అత్తారిల్లూ లేదు" అన్నాను గట్టిగా వత్తి పలుకుతూ. నేను సింపుల్ గా ఉంటానని అంటుంటారు, లక్షలు గడిస్తున్నానని. ఆ మాట అప్పుడె చెప్పేశాను.

"ఇలా అన్నవాళ్లమేనోయ్ మేము కూడా." నేనేం తక్కువ తినలేదని నిరూపించుకున్నాడు శ్రీధర్, పళ్ళు కాస్త బయట పెట్టి నవ్వి.

"కట్ చెయ్యండి" అని పేకముక్కలు రాజారావు ముందుకి తోశాను, ఎప్పటికీ అంతు కనపడని మాటలను త్రుంచి వెయ్యాలని.

"ఈ పేకాటలోనే లక్షా సంపాదించేద్దామనే!" అన్నాడు శ్రీధర్, మళ్లీ నన్ను ఎలాగైనా ఆట పట్టించాలని.

పండగ రోజున శ్రీధర్ కూడా చెక్కేశాడు అత్తవారింటికి. రాజామాత్రం సెలవు దొరక్క, మరీ ప్రతీ మాటూ వెళితే బాగుండదనీ కాబోలు ఊళ్లోనే ఉన్నాడు. బ్రహ్మచారినైన నాకు పండగ రోజు సాయంత్రం టీకి ఆహ్వానం వచ్చింది రాజారావు నుండి.

సాయంత్రం వెళ్లేసరికి రాజారావు మిసెస్ 'ఫెమినా' చూస్తూంది హాలులో కూర్చుని. నేను తటపటాయిస్తూ గుమ్మం దగ్గర చిన్నగా శబ్దం చేశాను, కాలిబూటుతో. తల ఎత్తిం దావిడ.

"రాజారావు ఉన్నారా?" అన్నాను.

"లోపలికి రండి" అని, "మా చెల్లెలు వస్తోందని స్టేషనుకు వెళ్లారు. ఈపాటికి వచ్చేయాల్సిందే. కూర్చోండి. వచ్చేస్తారు" అని కుర్చీలోనుండి లేచారు.

"ఫర్వాలేదు. నేను మళ్లీ వస్తాను లెండి" అని వెనుతిరగబోయాను, నన్ను పిలిచినట్టు మరిచిపోయాడని ఊహించుకుని.

"ఇప్పుడే వచ్చేస్తారు. మీరు వస్తారు, ఉండమని చెప్పమన్నారు" అం దావిడ నాలు గడుగులు ఇవతలికి వేసి.


మొండికేసి వెళ్లలేక వచ్చి కూర్చున్నాను హాలులో. ఆవిడా కూర్చుంది. నాకుమాత్రం మహా చెడ్డ ఇబ్బంది కలిగింది, రాజా వచ్చేదాకా ఇలాగే కూర్చోవాలి కాబోలని.

"మా పాప కూడా వెళ్లింది ఆయనతో. లేకపోతే కాలక్షేపానికి కొదవ ఉండదు. కొత్తవాళ్ల దగ్గరికైనా పరే ఇట్టే వెళ్లిపోతుంది. బెంకూ, భయమూ లేదు."

వినకపోతే బాగుండదు కదా అని వింటూ కూర్చున్నా 'ఊఁ' కొడుతూ.

"దానికి కొత్త బట్టలు కుట్టిస్తే, దాని బొమ్మకి కూడా కుట్టిస్తే కాని ఊరుకోదు. అదిగో, ఆ బొమ్మకి." చూపెట్టిం దావిడ ఉత్సాహంగా. బల్ల మీదఉంది పెద్ద సైజులో బొమ్మ. "ఈవేళే తొడిగాం దానికీ ఆ గౌను. యూరపియన్ ఫాషన్‌లోనే ఉండాలి మళ్లీ." నిజానికి ఆ బొమ్మ చాలా బాగుంది. దూరంనుంచి చూస్తే చిన్న పాపలా ఉందే తప్ప బొమ్మలా లేదు.

అదీ ఇదీ ఆవిడ మాట్లాడుతున్నా, వాళ్ళ పాప గురించి గర్వంగా చెప్పుకుంటున్నా రనిపించింది. 'ఎంతసే పలా కూర్చోవడం? అందులో చుట్టాలు కూడా వస్తున్నారంటే మరీ ఏం బాగుంటుంది? రాకరాక ఈ రోజే రావాలా వాళ్ళూ, నేనూ కూడా' అనుకుని, "నేను





పసి మనసులు

ఫోటో—సి. ఎస్. రావు (భోపాల్)

ఇంకో రోజు వస్తా లెండి. ఏమీ అనుకో వద్దని చెప్పండి" అని లేవబోయాను.

"అదేమిటండీ మరీ అంత మొహమాట పడతారు! పరాయి ఇల్లను కోకండి. మీ అక్కయ్యో, చెల్లెలు ఇల్లో అనుకోండి. అందులో రాష్ట్రం కాని రాష్ట్రంలో ఉన్నాం. ఒక భాష వాళ్ళంటే ఎంత క్లోజ్‌గానో ఉండాలి" అనేసరికి ఇంకేం మాట్లాడలేకపోయాను.

నిజమే అది. నాకూ తెలును, పై రాష్ట్రాలలోనూ, దేశాలలోనూ తెలుగు వాళ్లకన్న ఇతర రాష్ట్రాల వాళ్ళు కట్టుగా ఉంటారని. మనం మాత్రం ఎందుకు ఉండకూడదు? ఆంధ్రులకు మరీ మొహమాటం ఎక్కువేమో అనుకుని, "మొహమాటం కాదండీ. మీకు శ్రమ ఎందుకు? చుట్టాలు కూడా వస్తున్నారేమో?" అన్నాను.

"వాళ్లతోపాటే మీరూను. అంతే కాని ..."

మరేం ఆలోచించకుండా కూర్చున్నాను. కాస్సేపటికి టెలిగ్రామ్ వచ్చింది, వాళ్ల ప్రోగ్రామ్ డ్రాప్ చేసుకున్నట్టు.

"ఎందుచేత డ్రాప్ చేసుకున్నారో ఇంతట్లోనే? ఆయన ఏం తినకుండా వెళ్ళిపోయారు మధ్యాహ్నం అనగా."

"అరే అయితే భోజనం చెయ్యకుండా వెళ్ళిపోయారా!" అన్నాను ఆశ్చర్యంగా.

"భోజనం చేశారు లెండి. వెళ్ళే ముందు కాస్త కాఫీ కూడా..." అని బాధపడుతుంటే — "ఏదేనా తీసుకునే ఉంటారు లెండి" అన్నాను, మరీ అంతగా భర్త గురించి బెంగ పెట్టేసుకుంటుంటే ఓదార్చుదామని.

"అయ్యో! అలా తినే రకమైతే ఇంకేం? ఎప్పుడూ బయట తినరు. తినలేరు కూడా. అన్నీ ఎంతో శ్రద్ధగా చేసిపెడితే తప్ప ..."

తినే రకంట. అంటే, అంత కనీసంగా ఉందా! హోటళ్లలో తినే వాళ్ళంతా మట్టికొట్టుకు పోయారా! అవతలవాడేం అనుకుంటాడో అని లేదు. ఓహో, అదంతా భర్త మీద ప్రేమ కాబోలు!

అరగంట గడిచింది. భర్త ఏం తినలేదు, తాగలేదన్న బాధే కాని, వీడికో కప్పు కాఫీ ఇవ్వాలన్న దృష్టి లేదు, ఇంతసేపై వచ్చినా.

ఇంతలో రాజారావు డుర్రుమని మ్యాటర్ శబ్దం చేసుకుంటూ వచ్చాడు. "అయామ్ వెరి సారి, మూర్తి! మా వాళ్ళు వస్తారంటే స్టేషనుకు వెళ్లవలసిచ్చింది" అన్నాడు రాజా, విశ్రాంతిగా సోఫాలో కూర్చుంటూ. భార్యామణి టెలిగ్రామ్ విషయం చెప్పింది.

"సరే కాని, జయా ... మూర్తికి టిఫిన్ పెట్టలేదా ఇంకా?"

"లేదు. మీరు వచ్చేస్తారని చూస్తున్నా" అంటూ వెళ్లి రెండు పళ్లాల నిండుగా స్వీట్సు, హాట్సు పెట్టి తెచ్చిం దావిడ. నాలుగు కోక్స్ అప్పుడే ఫ్రిజిడెయిర్‌లోంచి తీసి తెచ్చి బల్లమీద ఉంచి, "బేబీ!" అని పిలిచింది. పాప తెల్లగా, బొద్దుగా ఉందేమో ముద్దులొలుకుతూంది.

పెద్దతరహాగా వచ్చేసి బేబీస్ ఛెయిర్‌లో కూర్చుని, "అంకుల్ కిచ్చావా?" అంది.

అంకుల్‌ట. ఎవరో చెప్పిపెట్టినట్టు ఎంక్వయిరీ చేసింది.

"అంకుల్‌కి విష్ చేశావా?" అన్నాడు రాజారావు.

"మరి అంకుల్ నాతో మాట్లాడలేదుగా!" అంది ముద్దుగా, తల్లి అందించిన గ్లాసు చేత్తో పట్టుకుని.

భార్యా భర్త లిద్దరూ పగలబడి నవ్వారు. నేనూ శ్రుతి కలిపాను. పాప మాత్రం డ్రింకు తాగుతూ ఉంది, నెందుకు నవ్వుతున్నారో అర్థం కాక.

**సుఖంగా జీవించే భార్యాభర్తలను చూసి తనూ అలా ఉండాలని బ్రహ్మచారి ఆశించటం దురాశ కాదు. కాని, తను వరించే భార్య తన గడపలో అడుగు పెట్టాకగాని జాతక రేఖలు బయటపడవు. ఆశించిన ఫలితం దక్కనివాడికి గతమే బాగనిపిస్తుందేమో!**

రోజులు గడుస్తున్నాయి. తన తడాకా చూపిస్తూ వేసవి ప్రవేశించింది. అంటే, పెళ్ళిళ్ల రోజులు వచ్చాయన్న మాట. పిన్ని కొడుకు వివాహాహ్వానం వచ్చింది. అమ్మా, నాన్నా కూడా వ్రాశారు రమ్మని. ఏడాది దాటిందేమో దూరంగా వచ్చేసి. సరే, బయలుదేరాను స్వంత ఊరుకు.

అమ్మకి ఒంట్లో బాగులేదు. నాన్న గారు రానన్నారు. నేను పెళ్లికి వెళ్ళాను. మగ పెళ్ళివారమేమో సకల మర్యాదలు చేస్తున్నారు. విడిది హాలులో ఓ పాతిక మేలు రకం కుర్చీలు వేయించారు. చిన్నాన్న పెద్ద పాకెట్టు నిండా సిగరెట్టు పెట్టెలు పెట్టి బల్లమీద పెట్టారు. చిన్నాన్నలూ, మామయ్యలూ అందరూ కూర్చున్నారు. నేను కూడా వచ్చాను.

"మూర్తీ, కమాన్ టేక్ యువర్ ఛెయిర్!" అంటూ మామయ్య కుర్చీ కాస్త ముందుకు తోశారు. మరికొందరు నావైపు చూశారు ఛీఫ్ గెస్ట్ వచ్చినట్టు.

పెరసనాలిటీయేకాకుండా చదువూ, హోదాలో ఉన్న ఉద్యోగం, దానికి తోడు అందం. అంతకంటే ముఖ్యమైనది బ్రహ్మచారిని.

ఒక సిగరెట్ పాకెట్టు అందించారు. "అలవాటు లేదు" అని చెప్పాను.

"వెరీ గుడ్! అంత దూరాన ఉన్నా, ఇండిపెండెంట్‌గా ఉన్నా ఇలాంటి అలవాట్లు కాలేదన్న మాట" అన్నారు ఒక మామయ్య.

నాకు నవ్వు రాబోయింది. 'దూరంగా ఉంటేమాత్రం, ఇండిపెండెంట్‌గా ఉంటే మాత్రం ఇలాటి అలవాటు

చేసుకోవాలని ఎక్కడా లేదు' అనుకున్నా

అక్కడే అత్తయ్యలూ, పిన్నులూ కూర్చుని మాట్లాడుకుంటున్నారు. పెళ్లి వంకన అంతా ఎక్కడెక్కడి వాళ్లూ ఓసారి కలుసుకుని కాలక్షేపం చేస్తున్నారు.

"ఇంజినీరు రెడీగా ఉన్నాడు. ఛాన్సు పోగొట్టుకోకండి, వదినా" అంది ఒక పిన్ని ఇంకెవరితోనో, నావైపు చూస్తూ. తేళ్లూ, జెర్రులూ పాకినట్లయింది ఒళ్లంతా. మరునాడుపొద్దున్నపదింటికి ముహూర్తం. ఏవో తతంగాలు జరుగుతున్నాయి. అంతమంది బంధువులున్నా నన్ను ఒంటరితనం ఆవరించింది. ఇంత తొందరగా ఎందుకు వచ్చానా అనిపించింది. పోనీ, ఎక్కడికైనా వెడదాం అంటే అది శుద్ధ పల్లెటూరు. ఎండిపోయిన చెరువులూ, ఎండుగడ్డి తప్ప అందంగా వచ్చిన పైరు లేదు. నా అదృష్టం అన్నట్టు సాయంత్రం కావస్తుంటే జగన్నాథం వచ్చాడు. బ్రతుకు జీవుడా అనిపించింది. ఎందుకంటే, మేం ఇద్దరం బంధువులమే కాకుండా స్నేహితులం కూడా. ఒకే కాలేజీలో, ఒకే హాస్టల్లో ఉండేవాళ్లం. సాయంత్రందాకా హాయిగా కబుర్లు చెప్పుకున్నాం. కాలం ఇట్టే గడిచినట్లయింది. ఇంతలో జగన్నాథం భార్య ఇద్దరికీ కాఫీ తెచ్చింది.

"చూడు, రాజీ, మీవా క్లైవరో ఉన్నారన్నావు కదూ ఈ ఊళ్లో? తొందరగా తెములు. వెళ్లొచ్చేద్దాం" అన్నాడు జగన్నాథం.

ఇద్దరూ బయలు దేరారు.

"మూర్తీ, తొందరగానే వచ్చేస్తాలే. ఎక్కడికీ వెళ్లిపోకు. నీ కింకా చాలా విషయాలు చెప్పాలి" అని వెళ్లిపోయాడు.

ఈసారి వాడిమీద చచ్చేంత కోపం వచ్చింది. చదువుకునే రోజుల్లో నేను లేనిదే ఎక్కడికీ వెళ్లేవాడు కాదు. ఇప్పుడో — పోనీ, మర్యాదకైనా 'నువ్వు కూడా వస్తావా' అనలేదు. హుఁ. నేను పెళ్లిచేసుకున్నాక అసలు వీడి ముఖం కూడా చూడను — అనుకుని అంతలోనే నాలిక కరుచుకున్నాను.

ఎంతకాలానికో కలుసుకున్నాం— ఉత్తర, దక్షిణ ధ్రువాల నుండి. వాడు వచ్చాక భోజనం చేద్దామని కూర్చున్నాను. భార్య తాలూకు వాళ్లింట్లో సకల మర్యాదలతో విందారగించి మా వాడు తాంబూలం నములుతూ వచ్చేసరికి నీళ్లు నమలవలసివచ్చింది నేను.

మరువాడు పెళ్లి వేళకి అందరూ తయారవుతున్నారు. రాత్రి ఆలస్యంగా నిద్దపోయానేమో- లేచేసరికి బాగా పొద్దు పోయింది. ఉన్న బాత్ రూములన్నీ నిండిపోయాయి. ఎవరో చెంబెడు నీళ్లిస్తే దంతధావనం కానిచ్చాను. ఎవరి గొడవల్లో వాళ్లు ఉన్నారు. జగన్నాథం మాత్రం నన్ను చూశాడు, ముఖం కడుక్కొచ్చేసరికి.

"రాజీ, కాఫీ ఏమైనా ఉందేమో చూడు మూర్తికి" అన్నాడు. పెద్ద దర్జాగా సిగరెట్ ముట్టించి. వాడి పెద్దరికానికి ఆశ్చర్యం వేసింది — వారానికో సినిమా తప్ప చూడని వాడికి ఈ పాడు అలవాటు ఎలా అలవడిందని.

"మీకు సెకండ్ ఫైవ్ కని ఫ్లాస్కులో ఉంచాను" అం దావిడ, భర్త విడిచిన బట్టలు మడత పెడుతూ.

"అయితే ఇంకేం? ఇలా ఇచ్చెయ్" అన్నాడు జగన్నాథం. 'ఆహా, ఏం దర్జా! పెళ్లి తెచ్చుకోలేడూ ఆ పాటి?' అనిపించింది. మడత పెడుతున్న పాంటు అలాగే వదిలేసి, కాఫీ అందించిం దావిడ. ఆ కాఫీ [illegible]కాలేదు. భార్య భర్త కోసం అంటూ ప్రేమతో ఉంచింది. వద్దు అంటే అలిగా ననుకుంటారు. ఎవరికైనా తెలిస్తే బాగుండదు. పెళ్లి కొడుకు మేనత్త అల్లుడి చెల్లెలు మొగుడి బావమరిదికి కాఫీ ... అని ఏవో కథల్లో చదువుతున్నట్లు నన్ను కూడా ఎవరు, ఎక్కడ, ఏమనుకుంటారో అని, "ఫిఫ్టీ ఫిఫ్టీ" అన్నాను. కాఫీ కూడా స్పెషల్ గా ఉందేమో — జగన్నాథం నా మాట కాదనలేదు.

'భార్య ఉంటే ఇదే అడ్వాంటేజ్ కాబోలు' అనుకుని కాఫీ తాగాను. ఇంకా ఏమేం లాభాలో చూపిస్తున్నట్టు, భార్య చేత తువ్వాలు అందింపించుకుని, తలకు నూనె మర్దనా చేయించుకుని స్నానంచేసి వచ్చి, "రాజీ, బాత్‌రూమ్‌లో నా లుంగీ ఉంది" అన్నాడు. అంటే, దాన్ని ఆర వెయ్యమని అర్థం. నా పనులన్నీ నేనే చేసుకుంటుంటే నా వైపు వాడు జాలిగా చూసినట్లనిపించింది. పెళ్లి పందిట్లో భార్యాభర్తలు జంటలు జంటలుగా కనిపించి నప్పుడల్లా నా ఒంటరి జీవితానికి నాకే జాలి పుట్టింది. సపర్యలు చేస్తున్న పతివ్రతలు కళ్లలో మెదిలారు.

నేనూ సపర్యలు చేయించుకుంటున్నట్టు కలలు కన్నాను.

• • •

నిజంగానే ఓ మంచి ముహూర్తాన వివాహం జరిగింది నాకూ. అందమైన భార్యను చూసి ఎంతో గర్వించాను. మరుసటి సంవత్సరమే మూడో మెంబరు జాయిన్ అయ్యాడు మాతో.

"ఏమండీ, కాస్త ఆ తువ్వాలిలా ఇచ్చేద్దురూ" అంటుంది, బాబిగాడికి స్నానం చేయిస్తూ. "కాస్త ఒక్కసారి, ప్లీజ్! కూర ఉడికిపోయి ఉంటుంది, దింపేద్దురూ. చాలు" అంటుంది, వాడికి తుడుస్తూ. ఇది ప్రొద్దుటి కార్యక్రమం. ఇలా చెప్పినవి చెయ్యకపోతే నా టైముకి కావలసినవి అమరవు.

సాయంత్రం ఇంటికి వచ్చేసరికి బాబిగాణ్ణి బయట తిప్పాలి. వాడితోపాటు క్లబ్బులో ఆడుకోవాలి. "బంట్రోతుల మీద వదిలేస్తే పిల్లలు పాడయిపోతారు. దిష్టి తగులుతుంది" అంటుంది పైగా ఏమైనా అంటే. "ఆహా, కొడుకంటే ఎంత ప్రేమ, ఎంత శ్రద్ధ!" అంటారు పై వాళ్లు.

ఆ రోజు ఏదో పండగ. లలిత వచ్చి, "ఏం చెయ్యనూ?" అనడిగింది.

"నీ ఇష్టం" అన్నాను.

"సరే. మీకు బొబ్బట్లు ఇష్టమేనా?" అంది లలిత.

"ఓ. ఇష్టమే. నీ కొచ్చా చెయ్యడం?" అన్నా ఆశ్చర్యంగా. ఏమంటే, ఈరోజుల్లో కస్టర్డ్స్, ఫ్లేవర్సు తప్ప బొబ్బట్లూ, బూరెలూ ఎవరు చేస్తున్నారు, అందులో కాస్త చదువుకుని ఫాషన్‌గా ఉన్నవాళ్లు?

"వంటలూ— పిండి వంటలూ లో ఉంది" అని చెప్పి, వెళ్లి పుస్తకంలో ప్రకారం అన్నీ అమర్చుకుంది. స్టౌమీద పెనం కాలిపోతూంది. ఒకటి అరటి ఆకు మీద వత్తి వేసి, ఇంకొకటి చేసే లోపల పెనం మీద అట్టు మాడింది. అది తీసి ప్లేటులో పెట్టి, "ఏమండీ, మీరు రావాలి" అంది. నోరు భలే ఊరుతోంది. అప్పుడే చెయ్యడం అయింది కాబోలని చూద్దునుగా— పెనం కోపం వచ్చినట్టు చూస్తూంది. పూర్ణం గిన్నె దీనంగా చూస్తూంది. "అన్నీ రాసింది కాని, ఎందరు మనుష్యులు కావాలో లేదండీ ఇందులో" అంది లలిత.

నాకంతా అర్థమయిపోయింది. ఇందుకే "వంట మనిషిని పెట్టుకోకూడదూ" అంటే, "మన తిండి వాళ్ల కళ్లలో పడకూడదండీ. అయినా, ఈమాత్రం రెండు మెతుకులు వండుకోవడానికి పరాయివా ళ్లెందుకూ — వాళ్ల కంట్రకం ..." అంటుంది. లలితని గురించి గట్టిగా ఆలోచిస్తే నాకే ఎంతో ఆశ్చర్యం కలుగుతుంది. లలిత బి. ఎ. చదివింది. ఇంటి పట్టున ఉంటుందా? వంటమనుషులూ, బంట్రోతులూ కావాలేమో ననుకున్నా. అంతకూ వ్యతిరేకం.

గబగబా లుంగీ బిగించి అట్లకాడ పుచ్చుకున్నాను. చకచకా లలిత వత్తుతూంది పూర్ణం పిండి ముట్టి.

'ఆడుతూ పాడుతూ పని చేస్తుంటే' అనే పాట వినిపిస్తూంది రేడియోలో నుండి. ★

